క్లుప్తంగా

ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఆర్డీఓ సుజన, అధికారులు

పాలసముద్రం : రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు విధిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని నగరి డివిజన్ ఆర్డీఓ సుజన తెలిపారు. ఆదివారం మండలంలోని ఏట్టు కూరిపల్లె, పాలసముద్రం పంచాయతీల్లో రైతులు సాగు చేసి పంటలకు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ నమోదు కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ-క్రాప్ బుకింగ్ చేశారా? లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న చేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ గాలి మహేష్ బాబు, తహసీల్దార్ బాబు, ఏఓ ఢిల్లీప్రసాద్, వీఆర్వో తంగరాజ్, వ్యవసాయ సహాయకులు వనజ, వీఆర్ఏ మునస్వామి పాల్గొన్నారు.

కషాయాలతో తెగుళ్ల నివారణ



విత్తనాలు పంపిణీ చేస్తున్న వాసు

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పంటలకు వచ్చే తెగుళ్లను కషాయాలతో నివారించవచ్చని చిత్తూరు ఏపీసీఎన్ఫ్ డీపీఎం వాసు తెలిపారు. ఆదివారం శ్రీకావేరిరాజుపురంలో జీవామృతం, కషాయం తయారీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పంట సాగు చేసిన రైతులు సొంతంగా జీవామృతం, కషాయం తయారు చేసుకోవచ్చని తెలిపారు. దేశీయ ఆవుపేడ 10 కిలోలు, మూత్రం 10 లీటర్లు, నల్లబెల్లం 2 కిలోలు, పప్పు దినసపిండి 2 కిలోలు, పుట్టమట్టి కిలో 20 లీటర్ల నీటితో కలిపి, వారం రోజులు పులియపెట్టాలన్నారు. తరువాత ఆ కషాయాన్ని తెగుళ్ల నిరారణకు వాడాలని తెలిపారు. అనంతరం కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

శ్రీరంగరాజపురం: మండలంలోని వేణుగోపాలపురం పంచాయతీ పరిధిలోని చిన్నబాపనపల్లె దళితవాడ, చిన్నబాపనపల్లె, నల్లపల్లె గ్రామాల్లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్ రెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి పాల్గొంటారన్నారు. డిప్యూటీ సీఎం ఇంటింటికి వెళ్లి పథకాల లబ్ధి అమలు, సమస్యలను గురించి తెలుసుకుంటారని తెలిపారు.

నేడు పట్టభద్రుల ఆత్మీయ సమావేశం

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లి మిట్ట దీపిక కల్యాణమండపంలో సాయంత్రం 5 గంటలకు గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ, పట్టభద్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయుచున్న శ్యాంప్రసాద్ రెడ్డి కూడా పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, పట్టభద్రులు, ఉపాధ్యాయులు, మండల కన్వీనర్లు, నాయకులు హాజరై, సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

భగవద్గీత పఠనంతో జ్ఞానం



భగవద్గీత గురించి వివరిస్తున్న ప్రబోధ సేవాసమితి సభ్యులు

తవణంపల్లె: భగవద్గీత పఠనంతో జ్ఞానం లభిస్తుందని త్రైతసిద్ధాంత ప్రబోధసేవా సమితి సభ్యులు అన్నారు. ఆదివారం వారు మండలంలోని లక్ష్మీనారాయణపురంలో ఆదివారం సాయంత్రం త్రైతసిద్ధాంత భగవద్గీత గురించి ప్రచారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ సత్యమైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని త్రైతసిద్ధాంత భగవద్గీత చదవడం ద్వారా తెలుసుకోగలరని సూచించారు.

మంత్రి పెద్దిరెడ్డికి బ్రహ్మోత్సవ ఆహ్వానం

పిచ్చాటూరు: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని సురుటుపల్లి శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో జరిగే శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆలయ పాలకమండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి ఆహ్వానించారు. ఆదివారం రేణిగుంట విమానాశ్రయం వద్ద మంత్రిని ఆలయ చైర్మన్, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, సభ్యులు, అర్చకులు కలిసి శివరాత్రి ఆహ్వాన పత్రికను అందజేశారు.

జల్లికట్టు..రాజకీయ (క్రీ)నీడ

కుక్కపిల్ల..సబ్బుబిళ్ల కాదేదీ కవితకు అనర్హం అన్నాడో మహాకవి. అలా నయా రాజకీయం రసవత్తరంగా మారిన నేపథ్యంలో జల్లికట్టు(ఎద్లపందేలు) కూడా రాజకీయ క్రీడగా అవతరిస్తోంది. కక్షలు, కార్పణ్యాలకు వేదికవుతోంది. ఫలితంగా గ్రామాల్లో అలజడులు, రగడలకు తెర లేస్తోంది. జల్లికట్టును రాజకీయ పార్టీలు ఒక ప్రచార సాధనంగా వినియోగించుకుంటున్నాయి. - వెదురుకుప్పం

- పచ్చని పల్లెల్లో చిచ్చు
- నీరు గారుతున్న పోలీసుల హెచ్చరిక



సింగపూర్ ఇండ్లలో పార్టీ జెండాలతో ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా పల్లెల్లో సంప్రదాయబద్ధంగా ఎద్లపందేలు నిర్వహించి పండుగను జరుపుకునే వారు. సాధారణంగా తమిళనాడులో నిర్వహించే జల్లికట్టు తరహాలో కాకుండా ఇక్కడ తేడాగా జరుపుతుంటారు. పశువులకు పూజించి, వాటి కొమ్ములకు పలకలు కట్టి పందేలకు ఉసిగొల్పేవారు. అల్లి వద్ద పలకలను పట్టుకుని యువత సందడి చేసేవారు. అయితే ఈ పందేలు రాను రాను పౌరుష పందేలుగా రూపాంతరం చెందుతున్నాయి. ఈ క్రమంలో పండుగ రోజుల్లోనే కాకుండా ఏడాది పొడవునా ఎద్ల పోటీలు నిర్వహించి, తద్వారా గ్రామాల్లో చిచ్చురేపుతున్నారు. ఎద్ల పందేలు ప్రమాదమని తెలిసినా పరువు కోసం ప్రాకులాడుతూ రూ.లక్షలు వెచ్చించి నానా ఇబ్బందులను కొనితెచ్చిపెట్టుకుంటున్నారు. కొన్ని ఎద్ల యజమానులను దృష్టిలో ఉంచుకుని, ప్రాణాలొడ్డి సాహసం చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఎద్లను నిలువరించి, పలకలు పట్టే సమయంలో ఇరు వర్గాలు పలకల కోసం కొట్లాటలు పెట్రేగుతున్నాయి. కిక్కిరిసిన జనం మధ్య దూసుకుపోతున్న కోడె గిత్తల ప్రతాపానికి యువకులు ప్రాణాలు కోల్పోవడమే కాకుండా గాయాలతో ఆస్పత్రిపాలవుతున్నారు. విభేదాలతో జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

రచ్చ రచ్చ....

మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ చిన్నపోటుచేను గ్రామంలో ఆదివారం జరిగిన ఎద్ల పందేలు రచ్చరచ్చగా మారాయి. పచ్చికాపల్లం పరిసర గ్రామాల మధ్య జరిగిన గొడవలు తీవ్ర వివాదానికి దారి తీశాయి. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. వినోదం, ఆనందం కోసం జరుపుకునే పశువుల పందేల్లో యుద్ధ వాతావరణాన్ని చూడాల్సి వస్తోందని గ్రామాల్లోని పెద్దలు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల మండలంలోని బ్రాహ్మణపల్లె, కురివికుప్పం, బాలుపల్లె, ఎగువకనికాపురం, మాంబేడు, సింగపూర్ ఇండ్లు, నంబాలపల్లె గ్రామాల్లో జరిగిన జల్లికట్టు పోటీల్లో అనేక సంఘటనలు చోటు చేసుకున్నాయి. అయినప్పటికీ గ్రామాల్లో జల్లికట్టును అధికారులు నిలువరించలేకపోతున్నారు.

ప్రచార వేదికగా ...

గ్రామాల్లో యువకుల మధ్య వివాదాలు తలెత్తడం ఒకింతైతే ఎద్ల పందేలు రాజకీయ పార్టీల ప్రచారాలకు వేదికలవుతున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా ప్రచారాల జోరు ఊపందుకుంటున్నాయి. ప్రధానంగా టీడీపీ, జనసేన పార్టీలకు సంబంధించిన కార్యకర్తలు, నాయకులు పశువులకు పార్టీల జెండాలు కట్టి పందేనికి వదులుతున్నారు. ముందుగా పార్టీ జెండాలతో ఎద్లను పట్టుకుని డప్పువాయిద్యాల నడుమ తిప్పుతున్నారు. ఆ తరువాత పలకలు, జెండాలు కట్టి పందేనికి వదులుతున్నారు. ఇది గ్రామాల్లో రాజకీయ విధ్వంసాలకు దారితీస్తున్నాయని పలువురు అంటున్నారు. సరదాగా అయితే దేవుడి చిత్రపటాలు, లేక అభిమాన హీరోల చిత్రపటాలతో ఎద్లను పందేనికి తీసుకొచ్చే వారు, ఇప్పుడు ఏకంగా రాజకీయ నేతల ఫొటోలతో కూడిన చెక్కలను ఎద్లకు కట్టి తద్వారా ప్రజల్లో తమ పార్టీ ప్రజల మెప్పుపొందాలని భావిస్తున్నారు. ఇన్ని సమస్యలున్నా జల్లికట్టు నియంత్రణలో పోలీసుల హెచ్చరికలు నీరుగారిపోతున్నాయి.

ఆంజనేయస్వామి ఆలయంలో తైపూసం పూజలు



నగరి : మున్సిపల్ పరిధి మారుతీ హిల్స్‌పై ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో తైపూసం పూజలు ఆదివారం వైభవంగా జరిగాయి. తైపూసం పూజలను పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు చేసి, స్వామివారికి విశేషాలంకరణ చేశారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు సహస్తనామ పారాయణం చేశారు. పారాయణం అనంతరం స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి అర్చనలు చేసి, కర్పూర హారతులు ఇచ్చారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ ఇన్నత్నాథన్

గంగాధరనెల్లూరు: మండలంలోని దాసరాపల్లె ఎస్టీ కాలనీలోని 40 కుటుంబాలకు ఆదివారం సింధూర్ సంస్థ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.2వేల విలువ చేసే నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. తహసీల్దార్ ఇన్నానాథన్ చేతుల మీదుగా నిత్యావసరాలను అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం శుభపరిణామమన్నారు. ఎస్టీ కాలనీవాసులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, సింధూర్ సంస్థ అధ్యక్షుడు రవి, వైఎస్సార్ సీపీ నాయకుడు కేశవులు పాల్గొన్నారు.

వైభవంగా రుద్రాభిషేకం



పూజ సామగ్రిని ఊరేగింపులో అర్చకులు, భక్తులు

పాలసముద్రం : మండలంలోని రాచపాళెంలో ఉన్న బాలగురునాథీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం భక్తులు తొమ్మిది బిందెల పాలు, తొమ్మిది బావుల్లోని నీటిని బిందెలు, పూజ సామగ్రి మంగళవాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగించి, స్వామివారికి సమర్పించారు. వేదపండితులు భక్తులు తెచ్చిన పాలు, నీటితో స్వామివారికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం రుద్రాభిషేకం నిర్వహించారు. రుద్రాభిషేక పూజలకు మండలంతోపాటు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

యూనిఫామ్ వితరణ



క్రీడాకారులతో దాత

వెదురుకుప్పం: మండలంలోని రాకెట్‌బాల్ క్రీడాకారులు హేమాద్రిరెడ్డి, గజేంద్రరాజు, కుమార్‌కు బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన వెంకటేశ్‌రెడ్డి ఆదివారం యూనిఫామ్ వితరణ చేశారు. ఇటీవల రాష్ట్ర జట్టు తరపున రాకెట్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన మండల క్రీడాకారులను ఆయన అభినందించారు. అలాగే ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరగనునున్న రెండో సీనియర్ రాకెట్ బాల్ ఫెడరేషన్ కప్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున ఎస్.హేమాద్రిరెడ్డి, గజేంద్రరాజు, కుమార్, కే.హేమాద్రిరెడ్డి పాల్గొనున్నట్లు కోచ్ నాగభూషణం తెలిపారు.

ఘనంగా మాఘ పౌర్ణమి పూజలు



పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెంలో ఉన్న మహాలక్ష్మి ఆలయంలో ఆదివారం మాఘ పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం లక్ష్మీనారాయణ హోమం, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల ఆధ్వర్యంలో హరికథా గానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సత్యనారాయయణ వ్రతంలో మహిళలు పాల్గొన్నారు.

నేడు పోలీసు కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని పేర్కొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో..

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన జరుగుతుందన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్యలో స్పందన జరుగుతుందన్నారు. స్థానికంగా ఉన్న ప్రజలు ఆయా సచివాలయాల్లో వినతులు అందచేయవచ్చన్నారు. ఇక ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 0857 2232745, వాట్సప్- 98499 07885కు సమస్యలు తెలియచేయవచ్చన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తుంచనున్నట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యాలయంలో స్పందన ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తామని, తమ సమస్యలపై ప్రజలు నేరుగా అధికారుల దృష్టికి తీసుకోరావచ్చన్ని ఆమె పేర్కొన్నారు.

వినాయకుని సేవలో జిల్లా కలెక్టర్



కాణిపాకం వినాయకస్వామి ఆలయంలో జిల్లా కలెక్టర్ హరినారాయణన్

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

కలుపుతీతలో కూలీలు

బిజీ... బిజీ



విస్తారంగా వర్షాలు కురవడంతో రైతులు అధిక విస్తీర్ణంలో వరిపంట సాగు చేశారు. గుడిపాల మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా వరి పైరు పచ్చగా కనిపిస్తోంది. గత కొద్దిరోజులుగా కూలీలు వరిలో కలుపుతీత పనిలో బిజీ, బిజీగా ఉన్నారు. - గుడిపాల

ఎమ్మెల్సీగా పేర్నాటిని గెలిపించండి

రేణిగుంట: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నిలిచిన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి కోరారు. రేణిగుంట పట్టణం, తూకివాకం సచివాలయాల పరిధిలో ఆదివారం పట్టభద్రుల వద్దకు వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనను చూసి వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో పట్టభద్రులకు సచివాలయ ఉద్యోగాలు కల్పించారని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేస్తున్నారని, విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తెస్తున్నారని ప్రచారం చేశారు.

వైభవంగా గరుడ సేవ



పూజలు చేస్తున్న అర్చకులు



భక్తులకు మాంగళ్యం చూపుతున్న అర్చకులు



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

గంగాధరనెల్లూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేపంజేరిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా గరుడ వాహనసేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు జరిపారు. మూలవర్లకు పాలు, పెరుగు, తేనె, సుగంధభరిత ద్రవ్యాలతో అభిషేకం చేసి, విశేషాలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం12 గంటలకు ఆలయ గర్భగుడి నుంచి శ్రీదేవి, భూదేవి శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా స్వామివారి కల్యాణమండపానికి మేళతాళాలతో వేంచేపు చేశారు. భక్తులను కంకణధారుల్ని చేశారు. శ్రీవారికి ఎదురుగా శ్రీదేవి, భూదేవి విగ్రహాలను ఉంచి ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుల మంత్రోచ్చారణలతో హోమం, ప్రత్యేక పూజలు చేశారు. శాస్త్రోక్తంగా శ్రీదేవి, భూదేవి మెడలో మాంగళ్య ధారణ చేశారు. భక్తులు స్వామి వారికి కానుకలు సమర్పించారు. ఆలయ ధర్మకర్త కె.శ్రీధర్, ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం శ్రీవారి ఉత్సవ మూర్తిని గరుడ వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు.

వేడుకగా పుష్కర కుంభాభిషేకం



కుంభాభిషేక పూజలు చేస్తున్న వేదపండితులు

నగరి : మండలంలోని కావేటిపురంలోని విజయగణపతి ఆలయంలో పుష్కర కుంభాభిషేకం ఆదివారం వైభవంగా నిర్వహించారు. పోదూరు సాయిప్రసాద్ శాస్త్రి, విష్ణుభట్ల లక్ష్మీపతి సోమయాజుల ఆధ్వర్యంలో కుంభాభిషేక పూజలు జరిగాయి. ఉదయం నుంచి ఆలయంలో వేదపారాయణం ప్రారంభించారు. పెద్ద ఎత్తున యాగపూజలు, కలశ హోమాలు, లక్ష్మీగణపతి హోమం, అష్టబంధనం, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. హోమపూజల అనంతరం కుంభ కలశాలతో ఆలయ శిఖరంపైకి చేరుకున్న వేదపండితులు మహాకుంభాభిషేకం నిర్వహించారు. అభిషేకం జలం కోసం జనం పోటీపడ్డారు. మహాకుంభాభిషేకం అనంతరం మూలవిరాట్‌కి మహాసంప్రోక్షణ, దీసుదర్శనం, విజయగణపతి దర్శనం కార్యక్రమాలు నిర్వహించారు. అర్చన, హారతి, మంత్రపుష్పం, మహదాశీర్వచనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త ఎ.రామకృష్ణ, పద్మప్రియ కుంభాభిషేక ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీనియర్ సిటిజన్లకు సన్మానం



విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న సభ్యులు

కార్వేటినగరం: విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లను ఆదివారం ఘనంగా సన్మానించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఈవీ గురురాజారావు మాట్లాడుతూ ప్రతి ఏటా ఫిబ్రవరి 5న విశ్రాంత ఉద్యోగుల్లో 75 సంవత్సరాలు పూర్తి అయిన వారికి సంఘం ఆధ్వర్యంలో సన్మానించడం అభినందనీయమన్నారు. ఎలాంటి పని ఒత్తిడి లేకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పెన్షన్‌దారులకు ఆయన సూచించారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు అరుణాచలం రెడ్డి, సుకుమార్‌రాజు ఆధ్వర్యంలో డాక్టర్ మధుసూదనరాజు, మల్లికామేశ్వరి, శ్రీధర్‌వర్మ, మురహరి, ప్రభావతమ్మ, సంపత్, గంగిరెడ్డికి శాలువలు కప్పి, పూల మాలలతో సత్కరించారు.

శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, ఆచరిస్తున్న భక్తులు



భక్తులతో నిండిపోయిన క్యూలైన్లు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ వరదరాజుల స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు సత్యనారాయణ వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో వెలసిన శ్రీదేవి, పెరుందేవి సమేత వరదరాజుల స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని సత్యనారాయణ స్వామి అలంకరణలో వ్రతాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై వ్రతం ఆచరించారు. రాత్రి స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కాణిపాకంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ..

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం ఉదయం నుంచి భక్తులు స్వామివారి దర్శనార్థం పెద్దసంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లు అన్ని భక్తులతో నిండిపోయి బయటవరకు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశ్ చర్యలు చేపట్టారు. అలాగే గర్భిణులకు, చంటిబిడ్డ తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనం కల్పించారు.

అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు



సుదర్శన హోమంలో పాల్గొన్న ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మూలవిరాట్ వీరాంజనేయస్వామికి అర్చకులు భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. చందనం అలంకరణలో వీరాంజనేయ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. పలురాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిప్రపత్తులతో సుదర్శన హోమం

పౌర్ణమి వేడుకల్లో భాగంగా ఆలయంలో అర్చకులు సుదర్శన హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా కలశపూజ చేపట్టి, అనంతరం వేదమంత్రాలను పఠిస్తూ హోమం జరిపించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి వైభవంగా ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్ర రెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు, ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి పర్యవేక్షణలో భక్తులకు దర్శనం ఏర్పాట్లు చేశారు.